


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు (డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

## రెండవ భాగం: బెర్లిన్ డ్వీపే డొయిచ్ ఖండే

## *చివరి విడత: మలి సందడి (45)*

**ముక్కుసూటి శోభన్**

శోభన్ ఘోష్‌లో నాకు నచ్చిన అంశాల్లో మొదటిది ముక్కుసూటితనం, రెండవది తనకు నచ్చినట్లు ఉండడానికి సంకోచించక పోవడం. మొదటిది అనుసరించడం నా వల్లకాదు. రెండవది అనుసరించాలని ఉన్నప్పటికీ, అందుకు జీన్సు కూడా సహకరించాలిగా– నా ఓవర్‌కోట్ ఉదంతం అదే చెబుతుంది.

ల్యూనబర్గులో జరిగిన ఈ ఉదంతాన్ని కాస్త విపులంగా ఇక్కడ ఎందుకు ప్రస్తావించాల్సి వచ్చిందంటే, శోభన్ మా ఇంటికొచ్చినప్పుడా కోటు చూశాడు. వాడకంలో లేదని తెలిసేక, తనకి కావాలని అడిగాడు.

షాక్ తిన్నాను. “నిజంగానా?” అన్నాను తేరుకున్నాక.

“నువ్వు వాడ్డంలేదు కదా అనడిగాను. నీకిబ్బంది లేకపోతేనే.....” అన్నాడతడు తేలికగా.

నాకో అతడికో చెప్పలేను కానీ– ఇబ్బంది లేకేం, ఉంది మరి!

ఆ కోటు కథేంటంటే....

మనలో చాలామంది తమ మానాన తాము బ్రతుకుతున్నామనుకుంటారు కానీ అది నిజం కాదు. మనం చేసేవన్నీ మన ఇష్టప్రకారం ఉండవు. పద్ధతికి ఎదురెళ్లలేకనో, ఎదుటివారి మెప్పును ఆశించో– తరచుగా మనకిష్టం లేని పనులు చేయాల్సొస్తుంది.

ఒకోసారి ఎదుటివారిని నొప్పించడమే ధ్యేయమై– మనకు వీలుకానివాటికి కూడా పూనుకుంటాం. ఐతే నా కోటు కథ ఈ కోవలోకి రాదు.

జర్మనీ చలి దేశమే ఐనా, అంత చలి నాకు కొత్తే అయినా, అంతా చలి గురించి భయపెట్టినా– కనీసం ఆరంభంలో చలి నన్నక్కడ ఇబ్బంది పెట్టలేదు. నావద్ద ఇండియానుంచి తెచ్చుకున్న ఉలెన్ స్వెటరుంది. చలిని తట్టుకోవడానికి అప్పటికది నాకు సరిపోయింది. అలా జర్మన్ లాంగ్వేజ్ కోర్సుకి ల్యూనబర్గులో ఉన్న మొదటి నెలంతా ఓవర్‌కోట్ లేకుండా స్వెటర్‌తోనే గడిపేశాను.

మిగతా ఇండియన్సు అలా కాదు. ఉత్తరాదివాళ్లు ఇండియానుంచి ఓవర్‌కోట్లు తెచ్చుకునొచ్చారు. దక్షిణాదివాళ్లు ఇక్కడికి రాగానే కొనుక్కున్నారు. లేనివాణ్ణి నేనొక్కణ్ణే!

ఉన్నాయి కదా అని వేసుకుని బయటకొచ్చేవారు కానీ, చలి ఆట్టే లేక ఆ కోటు ఎక్కువగా వాళ్ల చేతులమీదే ఉండేది. అందుకే లాంగ్వేజ్ కోర్సు పూర్తయి బెర్లిన్ వెళ్లేక అక్కడ కొనుక్కోవచ్చులే అని నేననుకునేవాణ్ణి.

తమని తాము సమర్థించుకుందుకో, లేక నేను నిర్లక్ష్యం చేసి ప్రాణాలమీదకు తెచ్చుకుంటానన్న భయమో, లేక వాళ్లు వాడుతున్నది నేనూ వాడాలన్న పంతమో చెప్పలేను కానీ, 'ఇది చలి దేశం. ఇక్కడ వాతావరణం ఇట్టిట్టే మారిపోతూంటుంది. క్షణం క్రితం ఉక్కబోస్తే, ఆ మరుక్షణం చలి గజగజ వణికించొచ్చు. బయటికొస్తే ఓవర్‌కోట్ దగ్గరుండాల్సిందే' అని మిత్రులు నొక్కించేవారు.

కొన్నాళ్లు తప్పించుకున్నాను.

ఓ శుక్రవారం సాయంత్రం లాంగ్వేజి క్లాసులయ్యేక, ఐదుగురు ఇండియన్ మిత్రులం కలిసి బజార్లో తిరుగుతుంటే, ఒకచోట షోకేసులో ముచ్చటగా ఉన్న స్పూల్ టైపు టేపు రికార్డర్ ఒకటి కనిపించింది. ధర చూస్తే 150 మార్కులే. కాసెట్ రికార్డరుకంటే తక్కువధర కొస్తోందని ఒక మిత్రుడు ఉత్సాహపడి లోనికి వెడదామన్నాడు. అంతా వెళ్లాం.

తీరాచూస్తే అది సెకండ్ హాండువి అమ్మే దుకాణం. ఎలక్ట్రానిక్‌వే కాదు– ఫర్నిచర్ నుంచి, బట్టలదాకా రకరకాలవి చౌకగా ఉన్నాయి.

విషయం తెలిసేక నా మిత్రుడికి టేపు రికార్డర్ అంత ముచ్చటగా కనబడలేదు.

తెలిసినవాళ్లు అమ్మితే ఏమో కానీ– షాపుకెళ్లి సెకండుహాండు సరుకులు కొనడం ఇష్టముండదు నాకు.

అందుకని అనాసక్తంగా అటూ ఇటూ చూస్తున్నాను.

ఒకసారి లోపల అడుగెట్టేక, వెంటనే బయటికి వెళ్లిపోవడం బాగుండదని మిగతావాళ్లు అక్కడేమున్నాయో చూస్తున్నారు. అంతలో ఓ మిత్రుడు ఓవర్ కోటొకటి చూసి, "చాలా బాగుంది. సైజు సరిపోతే నేనే తీసుకునేవాణ్ణి. ఇది మన రావుకి కరెక్టుగా సరిపోతుంది. జస్ట్ 20 మార్కులంటే కారుచౌక" అన్నాడు.

అంతే, మిత్రబృందమంతా నన్ను బలవంతపెట్టారు. 'ఇలాంటి షాపుల గురించి ముందే తెలిస్తే బాగుండేది. లేకపోతే, ఏడాదుండి వెళ్లిపోయేదానికి, ఓవర్‌కోటుమీద ఇంత డబ్బు తగలేసి ఉండేవాణ్ణి కాదు. ఇండియా వెళ్లేక దీనికింక పనేముంది?' అని ఓ దక్షిణాది మిత్రుడు వాపోతూ, 'బెర్లిన్ వెళ్లేక ఎలాగూ కొందామనుకుంటున్నావుగా, ఇది మంచి ఆఫర్. వదులుకోకు' అన్నాడు.

'ల్యూనబర్గులో ఉండగానే రావుని ఓవర్‌కోట్లో చూసే యోగం ఉండబట్టే– అనుకోకుండా మనమీ షాపులో ఎంటరైనట్లున్నాం' అన్నాడింకో మిత్రుడు– అప్పుడే నేనా కోటు కొనబోతున్నట్లే!

కొనడానికి నాకు మనసొప్పలేదు. సెకండ్ హాండ్ షాపులో ఉన్నాం కాబట్టి– సెకండ్ హాండ్ సరుకుల్ని చిన్నబుచ్చుతూ మాట్లాడ్డం మర్యాద కాదు కాబట్టి ఇంకేవేవో వంకలు చెబుతున్నాను.

అవసరముండీ డబ్బుకి వెనకాడి నేను ఓవర్‌కోట్ వాడ్డం లేదేమోనన్న అనుమానం బలంగా ఉన్నట్లుంది. ఉన్నట్లుండి వాళ్లంతా ఆ షాపుకి సేల్సుమెన్‌గా మారిపోయారు. మంచి తరుణము మించిన దొరుకదు– అంటూ బలవంతపెట్టారు.

నా స్థానంలో శోభన్ ఉండి ఉంటే– తనకూ ఇష్టమైతే ఏమో కానీ, కేవలం వాళ్ల మాటలకు లొంగేవాడు కాదు.

అయిష్టంగానే నేనా కోటు కొన్నాను. కొన్న మర్నాడే పెద్ద వాన. బయటకెళ్లడానికి కోటు అవసరమైంది. అటు వాననుంచీ, ఇటు చలినుంచీ కూడా అదిచ్చే రక్షణ స్వానుభవమయ్యేక– కోటు కొని మంచిపనే చేశాననుకున్నాను.

మర్నాడు ఆదివారం. రివాజుగా మిత్రుడు నటరాజన్ ఇంటికి బయల్దేరాను. ఓవర్‌కోట్ వేసుకోవడం మర్చిపోలేదు.

నటరాజన్ ఇంటి దగ్గర అతడి ల్యాండ్‌లేడీ కనబడి విష్ చేసింది. ఆమె ఎక్కడ నా కోటుని తేరిపార చూస్తుందోనని, మర్యాదకు నేనూ విష్ చేసి హడావుడిగా వెళ్లిపోయాను.

గదిలో నటరాజన్ నన్నోసారి తేరిపార చూసి నా కోటుని మెచ్చుకున్నాడు. మెచ్చుకోక ఏంచేస్తాడు– బలవంతపెట్టి కొనిపించినవారిలో తనూ ఉన్నాడుగా– అనుకుంటూ కోటు గోడ మూలకున్న స్టాండుకి తగిలించాను.

పక్క గదిలోనే ఉంటున్న బిశ్వాస్ కాసేపటికి వచ్చి కాసేపు కూర్చుని వెళ్లాడు. ఏదో ఒక పెడసరం మాట అనడం అతడికలవాటు కాబట్టి, అతడుండగా కోటు టాపిక్ రాకూడదనుకున్నాను. అదృష్టంకొద్దీ నటరాజన్ ఆ టాపిక్ తీసుకురాలేదు.

పాతదైనా ఆ కోటు నాకు కొత్తదే కదా! మర్నాడు సోమవారం చలి లేకపోయినా, వాన సూచనలు కానరాకపోయినా– గ్యోతే ఇన్స్టిట్యూట్‌కి కోటు వేసుకునే వెళ్లాను. క్లాసుకి వెళ్లేముందు ఓవర్ కోట్లు ఉంచడానికి కేటాయించిన గదిలోకి వెళ్లాను.

నేనా గదిలోకి వెళ్లడం అరుదు కదా– అక్కడున్న ఇద్దరు ముగ్గురు నన్ను ప్రత్యేకంగా పలకరించి కోటు కొన్నావా అనడిగారు. నేను ఊఁ అనగానే విని ఊరుకున్నారు.

వాళ్లు కోటుని మెచ్చుకుంటారని ఆశించానేమో, అలా జరక్కపోవడంతో నాలో అది సెకండ్ హేండుదన్న కాంప్లెక్సు మొదలైంది.

తర్వాతనుంచి ఎవరు కనబడినా– నన్ను కాక నా కోటుని చూస్తున్నట్లు అనిపించింది. ఏదో అనాలనుకుని అనలేక తటపటాయిస్తున్నట్లు తోచింది. కొందరు నవ్వుకుంటున్నారా అని అనుమానం కూడా వచ్చింది.

రెండ్రోజుల తర్వాత నటరాజన్ మాటల సందర్భంలో, “నిన్న నువ్వు మా ఇంటికొచ్చినప్పుడు మా ల్యాండ్‌లేడీ నీ ఓవర్ కోట్ చూసింది. బాగుందని మెచ్చుకుంది కానీ సెకండ్ హేండుదనగానే అంత తృప్తిగా లేదు” అన్నాడు.

“డబ్బున్నవాళ్లు కదా, సెకండ్ హేండ్ అంటే చిన్నచూపేమో!” అన్నాడు పక్కనున్న గుప్తా.

"అదేం కాదు. సెకండ్ హాండ్ దుకాణాలేం మనకోసమని తెరవలేదు. ఇక్కడ వీళ్లూ వాటిలో షాపింగ్ చేస్తారు. కానీ బట్టలైతే, అవి ఎవరో కట్టి విడిచినవి కదా– అందుకని వాటి విషయం వేరుట. ఇక ఓవర్‌కోట్ల గురించైతే వాళ్లకి వేరే సెంటిమెంటుంది. సాధారణంగా ఎవరూ ఓవర్ కోట్లు సెకండ్ హాండ్ దుకాణాలకివ్వరట. ఇచ్చేరంటే అవి అర్ధాంతరంగా చనిపోయినవాళ్లవై ఉంటాయి. వాళ్ల ఆత్మలు ఆ కోటుని ఆవహించుకుని ఉంటాయని నమ్మేవాళ్లలో మా ల్యాండ్‌లేడీ కూడా ఉంది" అన్నాడు నటరాజన్.

ఇది నాకు ఊహించని కొత్త సమాచారం.

దయ్యాల విషయంలో చాలామందికిలాగే– నాకూ నమ్మకం లేదు కానీ, భయముంది. అందుకే నటరాజన్ మాటలకి ఒక్కసారి వళ్లు జలదరించింది.

అతడు చెప్పింది వినగానే– ఇక నా ఫ్రెండ్సు నామీద ప్రశ్నల వర్షం కురిపించారు.

'వేసుకున్న మొదటి రోజు ఏమనిపించింది?' అని ఒకడు. 'ఆ రాత్రి పడుకున్నాక కలలో ఎవరైనా అపరిచితులు కనిపించారా?' అని మరొకడు. 'ఇప్పుడు నువ్వు చేసే పనులు నువ్వు చేస్తున్నట్లే ఉందా, లేక ఎవరో చెబుతుంటే, చేస్తున్నట్లు అనిపిస్తోందా?' అని ఇంకొకడు–

సినిమాల్లో కొత్త హీరోయిన్ని ఫస్ట్ షాట్‌కి వంద టేక్సు తీసుకున్నాకా, క్రికెట్లో కొత్త బ్యాట్సుమన్ని ఫేస్ చేసిన ఫస్ట్‌బాల్‌కే ఔటైనప్పుడూ– అడిగే విలేకర్లలా!

ఏంచేస్తాను– పిల్లికి చెలగాటం, ఎలక్కి ప్రాణసంకటం– అదీ నా పరిస్థితి.

మనసులో ఇబ్బందిగా ఉన్నా– వాళ్లని ఆపకపోతే లాభం లేదనిపించింది.

'మొదటి రాత్రి కలలో, ఓ అపరిచితుడు కనిపించాడు. నడివయస్కుడు. చూడ్డానికి బాగున్నాడు. మాట్లాడ్డానికి మనుషులు దొరకడం లేదుట. నాచేత కోటు కనిపించినవాళ్ల అడ్రసులు కావాలన్నాడు' అన్నాను.

'ఎవరెవరి విచ్చావేమిటి?' అన్నాడు గుప్తా.

'నేను చెప్పడమెందుకు? ఎవరి కలలోకొస్తే వాళ్లే చెబుతారు' అన్నాను.

వాళ్లు కాస్త తగ్గారు. కానీ మనసులో ఇబ్బంది నాకింకా తగ్గలేదు. దాన్నించి బయటపడ్డానికి, తెలిసిన కొన్ని దయ్యాల కథల్ని కలలుగా మార్చి చెప్పాను. దాంతో ఉత్సాహం పుట్టి మరో ఇద్దరు తమకు తెలిసిన దయ్యాల కథలు చెప్పారు.

ఆ తర్వాత మా మధ్య అటు ఓవర్‌కోటూ, ఇటు దయ్యాలూ కూడా సంభాషణల్లోకి చొరబడలేదు. కానీ మనసులో– ఆ కోటు కొనకుండా ఉండాల్సిందన్న భావన ముల్లై తరచుగా గుచ్చుతూనే ఉండేది నన్ను.

ఇంతకీ నన్ను బలవంతపెట్టి కొనిపించింది వాళ్లు. నా మొహమాటం వాళ్ల బలవంతానికి లొంగేలా చేసింది.

బెర్లిన్ వెళ్లేక నాకు కోటు గురించిన కాంప్లెక్సు పూర్తిగా పోయింది. అది సెకండ్ హాండుదని అక్కడెవరికీ తెలియదు కదా!

శ్రీమతి బెర్లిన్ వచ్చేదాకా, అంటే మూడు నెలల పాటు నేనా కోటుని బాగా వాడుకున్నాను.

శ్రీమతి రాగానే తనకి ఓవర్ కోట్ కొన్నాను. అప్పుడామె, "నా కోటు పక్కన మీ కోటు వెలవెలబోతోంది. మీరూ కొత్తది కొనుక్కోండి" అని బలవంతపెట్టింది.

"వెలవెలబోవడమేమిటి? కొన్నప్పుడెలాగుందో, ఇప్పుడూ అలాగే ఉంది" అన్నాను నేను.

"అంటే కొన్నప్పట్నించీ ఇలాగే ఉందన్నమాట! అవున్లెండి, సెకండు హాండుదిగా" అంది శ్రీమతి చటుక్కున.

తనిక్కడికి రానప్పుడు, ఇక్కడి నా అనుభవాలు చాలావరకూ– ఉత్తరాల ద్వారా పూసగుచ్చినట్లు తెలియబర్చేవాడినేమో– ఆమెకు ఆ కోటు నేపథ్యం కొంత తెలుసు.

అప్పుడామె మొహం చూస్తే– నాకు ల్యూనబర్గులో ఇండియన్ మిత్రుల ముఖభావాలే గుర్తుకొచ్చాయి.

"కాళిదాసు మొహం చూస్తే కవిత్వం పుట్టుకొచ్చినట్లు– ఈ కోటు చూస్తే నీలోనూ జోక్సు పుడుతున్నట్లుంది" అన్నాను చిన్నబుచ్చుకుని.

"మీకలా అనిపించిందా? నామీద నమ్మకంతో, నిజంగానే కోటు వెలవెలబోతోందేమోననుకుంటారనుకునాను" అంది శ్రీమతి.

ఆ రోజునుంచీ జాగ్రత్తగా పరిశీలిస్తే నా కోటు వెలవెలబోతున్నట్లే కాదు, వెలిసిపోయినట్లే అనిపించింది. ఆమె పట్టుదలతో– వెంటనే కాకపోయినా– తనకి కోటు కొన్న వారానికే నేనూ ఓ కోటు కొనుక్కున్నాను.

మామూలుగా ఐతే ఎంతో తెలితదు కానీ– ఆఫర్లో 45 మార్కులకి వచ్చింది. ఐతే అది ఓవర్‌కోట్ కాదు. దానికిలాగే చలినుంచి రక్షణ ఇచ్చే జాకెట్. దానికంటే పొడవు తక్కువ.

దీనికి లోపల జిప్పుతో అతికించిన 'పోలీ అక్రైల్' ఊలు లైనింగుంది. చలిగా లేనప్పుడు ఆ లైనింగ్ తీసెయ్యొచ్చు. అంతే కాదు, పాత కోటులా కాకుండా, దీనికి తల, మొహం, చెవులు కప్పుకునే సదుపాయముంది. అది వేసుకుని బయటకెడితే వంటికి చెమటలు పట్టేవి.

అన్నింటికీ మించి ఇది పాత కోటులా– కొన్నప్పుడే వెలవెలబోవడం లేదు. తళతళలాడిపోతోంది.

అబద్ధమెందుకూ– పాత కోటు తీసి కొత్తది వేసుకున్నప్పుడు ఏదో ప్రేతాత్మ నన్ను విడిచి వెళ్లిన అనుభూతి కూడా కలిగింది.

కొత్త కోటుతో ఆఫీసుకి వెళ్లినప్పుడు– ఆ మార్పుని చాలామందే గుర్తించారు.

ఎందుకు గుర్తించరూ– పాత కోటు రంగు నలుపు. ఇంచుమించు పాదాలదాకా వస్తుంది. ఈ జాకెట్ రంగు తళతళలాడే బ్రౌన్. మోకాళ్లకంటే కొంచెం పైకే ఉంటుంది.

అహమ్మద్ చాలా బాగుందని మెచ్చుకున్నాడు. హైనర్ డెకర్ట్ ఐతే, "హమ్మయ్య! కోటు మార్చావు" అన్నాడు.

హమ్మయ్య– అన్న ఆ ఒక్క మాటతో– నా పాత కోటు గురించి ఇక్కడా బోలెడు చర్చలు జరుగలేదు కదా అనిపించింది.

'కాంప్లెక్సు కాకపోతే, నీదాకా రానివాటి గురించి ఊహలెందుకూ' అని మనసు మెదడుని మందలించింది.

ఇక నేను మళ్లీ పాత కోటు ధరించలేదు. ఐతే మాకున్నది ఒక్కటే గది. అక్కడ ఓ మూల కొక్కేనికి కనబడుతూ రోజూ నన్నది వెక్కిరిస్తూనే ఉండేది. దాన్ని చూసినప్పుడల్లా, ఇన్నాళ్లెలా దీన్ని భరించాను– అనుకున్నాను.

ఆ కోటుని ఇప్పుడు శోభన్ అడిగాడు– తనకి కావాలని!

'వెంటనే ఇచ్చెయ్! రోజూ దాన్ని చూడాల్సిన అగత్యం తప్పుతుంది' అని మనసు ప్రోత్సహించింది.

శోభన్‌తో పరిచయమై ఎన్నాళ్లో కాలేదు. కానీ అప్పటికే అతడంటే అభిమానం ఏర్పడింది.

'నువ్వు పడ్డ మనోవ్యధంతా మర్చిపోయేవా? నిజం దాచి మిత్రద్రోహం చేస్తావా?" అని మనసు నన్ను కసిరింది.

నేను శోభన్‌కి ఆ కోటు కథ చెప్పి, "ఇంకా నీకా కోటు కావాలనిపిస్తే తప్పక ఇస్తాను" అన్నాను.

అప్పుడు శోభన్ తనదైన పద్ధతిలో ఓ నవ్వు నవ్వాడు. ఆ నవ్వు దూరంగా ఉన్నవాళ్లకి వినిపించేటంత బిగ్గరగా ఉండదు కానీ– దగ్గరున్నవాళ్లకి గట్టిగానే అనిపిస్తుంది. నవ్వినప్పుడు అతడి మొహంలో సంతోషమో, వ్యంగ్యమో పసికట్టలేని విచిత్రభావం కనిపిస్తుంది.

"ఎందుకు నవ్వుతున్నావ్!" అన్నాను.

శోభన్ మాట్లాడకుండా కోటు దగ్గరకెళ్లి కొక్కెంనుంచి దానికి విముక్తి కలిగించాడు. ఓసారి ఆప్యాయంగా దాన్ని తడిమాడు. వెంటనే దాన్ని ధరించి, బీరువా అద్దముందు నిలబడి తనని తాను చూసుకున్నాడు. తర్వాత నావైపు తిరిగి, "సో! మొహమాటానికి కాక నువ్వు దీన్ని మనస్ఫూర్తిగానే నాకిస్తున్నావ్!" అన్నాడు.

"అంటే తీసుకుంటున్నావా?" అన్నాను.

"నాక్కావలసింది చలినుంచి రక్షణ. పైసా ఖర్చు లేకుండా అప్పనంగా వస్తున్న దీన్ని నేనెందుకు తీసుకోను?" అన్నాడు శోభన్.

"ఒక్కసారి భాబీజీని కూడా అడిగి....." అని నేనింకా ఏదో అనబోతే–

"మన బట్టలు. మన సౌకర్యం. మనిష్టం. ఆ విషయంలో కూడా మనకి స్వేచ్ఛ లేకపోతే ఎలా?" అన్నాడు శోభన్ వెంటనే.

“నాకైతే బయటే కాదు, ఇంట్లో కూడా ఇది వేసుకుంటే బాగుంటుందనిపించింది. హీ లుక్స్ సో హాండ్సమ్” అంది శ్రీమతి శోభన్ భర్తని ముచ్చటగా చూస్తూ.

‘భర్తకు తగిన భార్య’ అనుకున్నాను. అతడి పుత్రరత్నాన్ని చూస్తే, ఇవేం పట్టించుకోకుండా మా పిల్లలతో ఆడుతున్నాడు. పరిస్థితి అర్థమై, ధారాళంగా మాట్లాడే వయసొస్తే, ‘నాన్నా! దీన్ని పాడుచెయ్యకు. పెద్దయ్యేక నేనూ వేసుకుంటా’ అంటాడేమో అనుకున్నాను. కానీ ఆ అవకాశం ఉన్నట్లు లేదు. ఎందుకంటే–––

భార్య ముచ్చట తీర్చడానికో ఏమో, శోభన్ ఇక కోటు విప్పలేదు. వెళ్లేటప్పుడు థాంక్స్ చెప్పాడు.

“నేనే నీకు థాంక్స్ చెప్పాలి” అన్నాను. కొంత నిజం. కొంత మర్యాద.

శోభన్ చిన్నగా నవ్వి, “నువ్వు థాంక్స్ చెబితే, నాకిది శాశ్వతంగా ఇచ్చేసినట్లు. నేను థాంక్స్ చెబితే, ఈ కోటు నేను తాత్కాలికంగా తీసుకున్నట్లు. అన్నదమ్ములదైనా సరే పరాయి సొమ్ముని ఉంచుకోను నేను. ఇండియా వెళ్లగానే నీకిది తిరిగిచ్చేస్తాను” అన్నాడు.

అప్పుడు నాకు శోభన్ పుత్రరత్నం అప్సెట్టవుతాడా, తేలికగా నిట్టూరుస్తాడా అన్నది ఊహల్లో తేలలేదు.

తర్వాత శోభన్ నాకు చాలాసార్లు ఆఫీసులోనూ, మార్కెట్లలోనూ కనిపించాడు. అతడినే నన్నుగా ఊహించుకుంటే– అప్పట్లో ఆ కోటువల్ల నేను అపహాస్యానికి గురైతే, అది న్యాయమేననిపించింది.

కానీ శోభన్– దిగంబరుడైన జైనముని నిస్సంకోచంగా జనం మధ్య తిరిగినట్లు– ఓవర్‌కోటాంబరుడై బెర్లిన్లో చిదానందుడై చరించడం–అనుసరించతగ్గ గొప్ప లక్షణం.

మేము ఇండియా వెళ్లిన ఏడాదికి శోభన్ కూడా ఇండియా వచ్చేశాడు. తానొచ్చిన మూడేళ్లకి కాబోలు– పూనాలోని తన సంస్థనుంచి బదిలీమీద వచ్చిన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు ద్వారా– నా ఓవర్‌కోటు వెనక్కి పంపాడు.

అతడి నిబద్ధత మెచ్చుకోతగ్గదే అయినా– నాకా కోటు మొక్కపాటివారి బారిస్టరు పార్వతీశం టోపీలా అనిపించింది.

కోటు నాకు చేరిన మరి కొన్నేళ్లకు–

ఆ రోజు లాబొరేటరీలో నా గదిలో– స్పెషల్ కంటెయినర్లోంచి ఓ స్పెషల్ థెర్మాస్ ఫ్లాస్కులోకి లిక్విడ్ నైట్రోజన్ వంపుతున్నాను. సెంటిగ్రేడ్ కొలమానంలో మంచుగడ్డది సున్నా డిగ్రీలైతే నైట్రోజన్ ద్రవరూపంలో ఉండడానికి –196 డిగ్రీలు. అంటే సున్నాకంటే 196 డిగ్రీలు తక్కువ. నీటిని వంద డిగ్రీలకు తీసుకెడితే ఆవిరిగా మారిపోయినట్లు, లిక్విడ్ నైట్రోజన్‌కి రూం టెంపరేచరు సోకగానే, తక్షణం ఆవిరైపోతుంది. ఎంత జాగ్రత్త తీసుకున్నా, కంటెయినర్లోంచి ఫ్లాస్కులో పోసేటప్పుడు కొంత నైట్రోజన్ ద్రవానికి రూం టెంపరేచర్ సోకక తప్పదు కదా! అందుకే నేను ఫ్లాస్కులోకి పోస్తుంటే, నైట్రోజన్ గాస్ పొగలుగా గదంతా వ్యాపించింది. కొద్ది క్షణాలు నేను గుహలో మాంత్రికుడిలా అస్పష్టంగా ఉన్నాను.

ఆ క్షణంలోనే గది తలుపు తెరుచుకుని లోపలకి ఇద్దరు ప్రవేశించారు. వారిలో ఒకరు నా జూనియర్. రెండవ వ్యక్తి శోభన్.

పూరీ–కోణార్క ట్రిప్ మీద ఇటొచ్చేట్ట. కొడుక్కి చదువు పోతుందని అక్కడే వదిలేసి రావాల్సొచ్చింది. అందుకని టైట్ ప్రోగ్రాం. ఈ రాత్రికే తిరుగు ప్రయాణం. నన్నోసారి చూడాలని వీలుచేసుకుని లాబొరేటరీకి వచ్చాడు. ఉత్తరాల ద్వారా అడ్రసు తెలుసు కాబట్టి– భార్యని మా ఇంటివద్ద వదిలేసి, తను లాబొరేటరీకొచ్చాడు. నా గురించి వాకబు చేస్తుంటే, జూనియర్ నా దగ్గరికి తీసుకొచ్చాడు.

నేను ప్రయోగాన్ని జూనియర్‌కి అప్పజెప్పి– సీట్లో కూర్చున్నాను. శోభన్ నాకెదురుగా కూర్చున్నాడు. "లాబ్ చూస్తావా?" అన్నాను.

"లాబ్, సైంటిస్టులు, డైరెక్టరు– ఇదంతా అక్కడా ఇక్కడా ఒకటే. అందులో చూసేదేం లేదు. అంతా రొటీన్. అఫీషియల్‌గా వస్తే ఎలాగూ తప్పదు. నేను నిన్ను చూడాలనొచ్చాను. మనం సైన్సు ప్రపంచాన్ని మర్చిపోయి– కాసేపు సరదాగా కబుర్లు చెప్పుకుందాం. నీకేం ఇబ్బంది లేదుగా" అన్నాడు శోభన్.

మా సైంటిస్టులకున్న సౌకర్యమే అది. ప్రయోగాల అవసరాన్నిబట్టి ఒకోసారి రాత్రింబవళ్లు పనిచెయ్యాలి. ఎవరికి వాళ్లమే బాసులం. మమ్మల్ని శాసించేవారుండరు. ఆఫీసు టైంలో మిత్రులొస్తే, వాళ్లతో మాట్లాడ్డానికి ఒకరి అనుమతి అవసరం ఉండదు. అలాగని విచ్చలవిడిగా తిరగకూడదు. క్రమశిక్షణను పాటించడానికి– 'షరతులు వర్తిస్తాయి' అన్న ముక్తాయింపు ఉండనే ఉందిగా.

"ఇబ్బందేం లేదు. ఇంటికెడదామా?" అన్నాను.

"వద్దు. బయట బాగా ఎండగా ఉంది. ఇక్కడ కాసేపు చల్లబడి వెడదాం. ఎలాగూ భోజనం మీ ఇంట్లోనేనని మిసెస్ రావ్ ఆర్డరేసేసింది" అన్నాడు శోభన్.

ఇంటికి ఏసీ లేదు. ఏసీ అంటే పెద్ద లగ్జరీ అనుకునే రోజులవి.

సుమారు గంటసేపు జర్మనీ ముచ్చట్లు చెప్పుకుంటూ కాలచక్రంలో చాలా ఏళ్లు వెనక్కి వెళ్లిపోయాం. ఎంత ఆహ్లాదంగా అనిపించిందంటే, అయ్యో– మళ్లీ అలాంటి రోజులొస్తాయా అనిపించింది.

తెలియకుండానే టైం ఒంటిగంటవడంతో, జూనియర్ మమ్మల్ని హెచ్చరించాడు. అది మాకు లంచ్ టైం.

ఆఫీసునుంచి మా ఇల్లు రెండు ఫర్లాంగులలోపే ఉంటుంది. నడుచుకుంటూ ఇల్లు చేరేసరికి, పన్నెండు నిముషాలు పట్టింది.

ఇల్లు చేరగానే శోభన్ భార్య తనే తలుపు తీసింది. "నమస్కార్. కంగారు పడొద్దు భాయిసాబ్! ఇది మీ ఇల్లే, నేను మిసెస్ ఘోష్‌ని" అంది.

నన్ను సర్ర్పయిజ్ చెయ్యడంకోసం ఆమె తనే తలుపు తీసిందని గ్రహించాను. ప్రతినమస్కారం చేసి లోపల అడుగెట్టాను.

శోభన్ నా వెనుకే లోపలికి రాగానే, "నమస్కార్ భాయిసాబ్! భోజనం రెడీయే కానీ ముందుగా చాయ్..." అంటూ శ్రీమతి శోభన్ వెనుకనుంచి ముందుకొచ్చింది శ్రీమతి.

ఒరియా, బెంగాలీలకి తరచుగా చాయ్ కావాలి. మా ఇంట్లో ఎవరికీ కాఫీ, టీ అలవాటు లేకపోయినా– అతిథుల విషయంలో ఆ మర్యాద శ్రీమతికి బాగా పట్టుబడింది.

శోభన్ వెంటనే, "నువ్వు నిండు నూరేళ్లు బ్రతకాలమ్మా! ఇడిగో మీ ఆయన దగ్గర గంటన్నర పైగా కూర్చున్నాను. ఎంతసేపూ కబుర్లు, కబుర్లు, కబుర్లే తప్ప– దుర్మార్గుడు చాయ్ ప్రస్తావనే తేలేదు. నాలిక పీక్కు పోతోంది. కడుపులో కాస్త చాయ్ పడితే తప్ప ఇంకో పని చెయ్యలేను" అన్నాడు.

ఛెళ్లున తగిలింది నాకు. చూడగానే శ్రీమతికి తట్టిన విశేషం అంతసేపు అతడు నాతో కూర్చున్నా ఎందుకు తట్టలేదు?

విశేషమేంటంటే– ఛెళ్లుమనిపించినా శోభన్ మాటలు నాకు నవ్వు తెప్పించాయే తప్ప, కోపాన్నీ, బాధనీ కలిగించలేదు. అతడు కూడా సరదాగా అనేసి వదిలేశాడే తప్ప– కసిగా ఆ మాటనలేదు.

అప్పుడు నాకు వినాయకుడి బొడ్లో తేలు కథ గుర్తుకొచ్చింది. ఆకథలో ఓ గుడి. అందులో వినాయకుడి బొమ్మ. ఆ బొమ్మ బొడ్లో వేలెట్టి చూసుకుంటే, మల్లెపూల వాసనొస్తుందంటారు. ఎవరికైనా అలాంటి సువాసన రాకపోతే, వాళ్లు పాపాత్ములై ఉంటారని కూడా అంటారు. ఎందుకొచ్చిందిలే అని ఎవ్వరూ ఆ బొడ్డు మహిమని పరీక్షించేవారు కాదు.

ఒకసారి నలుగురు మిత్రులు ఆ బొడ్డు మహిమని పరీక్షించాలనుకుని గుడికి వెళ్లారు. మొదటివాడు బొడ్లో వేలెట్టాడు.

ఆ బొడ్లోకి ఒక తేలు చేరి నివాసం ఏర్పరచుకుంది. అది మొదటివాడి వేలుమీద ఠక్కున కుట్టింది. కానీ వాడా బాధని ఓర్చుకుని, వేలుని వాసన చూసి, 'ఆహా, మల్లెపూల వాసన' అన్నాడు. ఆతర్వాతి ఇద్దరూ కూడా అదే పని చేశారు.

నాలుగోవాడు ముక్కుసూటి మనిషి. వాడికి నిజం మాట్లాడ్డమే తప్ప, జనం తన గురించి ఏమనుకుంటారోనన్న భయం లేదు. తనని తేలు కుట్టగానే వాడు, 'అమ్మో! తేలు' అన్నాడు. అప్పుడు అంతా ఔనన్నారు. తేలుని పుల్లపెట్టి బయటకు లాగి చంపేశారు.

ఒక్కడి ముక్కుసూటితనం– ఒక ప్రమాదానికి శాశ్వతంగా స్వస్తి పలికింది.

ఇంటికొచ్చిన అతిథులంతా శోభన్‌లా ఉండలేరు. శోభన్ పుణ్యమా అని నానుంచి నా అతిథులకి ఓ గొప్ప సౌకర్యం కలిగింది.

అప్పట్నించీ నా మర్యాద ఆహ్లాదకరమైతే ఆ ఘనత శోభన్‌ది. కాకపోతే ఆ తప్పు నాది.

ఇప్పుడు మళ్లీ వెనక్కి వచ్చి బెర్లిన్ నగర విశేషాలు ముచ్చటించుకుందాం.....

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments